క్లుప్తంగా

వృద్ధురాలికి జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



వృద్ధురాలిని షెల్టర్‌కు తీసుకొచ్చిన మమత

విశాఖ విద్య: ఓ వృద్ధురాలికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. భానుమతి అనే వృద్ధురాలు కేజీహెచ్ బయట నెల రోజుల నుంచి ఉంటుంది. ఈ విషయాన్ని కేజీహెచ్ సిబ్బంది జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమతకు చేరవేశారు. ఆమె శుక్రవారం కేజీహెచ్‌కు వెళ్లి వృద్ధురాలి వివరాలు తెలుసుకున్నారు. తన కూతురు హైదరాబాద్‌లో ఉంటుందని ఆరోగ్యం బాగోక పోవడంతో కేజీహెచ్‌కి వచ్చానని తెలిపింది. కూతురు పట్టించుకోక పోవడంతో ఎటు వెళ్లాలో తెలియక ఇక్కడ ఉండిపోయానని చెప్పింది.దీంతో స్పందించిన ఎల్లేటి మమత ఆ వృద్ధురాలిని షెల్టర్‌కు తీసుకు వచ్చి ఆశ్రయం కల్పించారు.

'వికసిత్ భారత్'లో భాగస్వాములు కండి



ఆయుష్మాన్ కార్డు అందజేస్తున్న జీవీఎల్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులైన వారు సంక్షేమ పథకాలను ఎలా పొందవచ్చో తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులు అందజేశారు. పశ్చిమ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ సిటీ జనరల్ సెక్రెటరీ పాలిమేర శ్రీనివాసరావు, నాయకులు సీహెచ్ మంజుల, నాదెళ్ల జ్యోతి, ఏపీడీ శ్రీరామ్, వైద్య, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల సందడి



బ్యాడ్మింటన్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలను శనివారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా ప్రతిభావంతుల్ని వెలికితీసే మంచి కార్యక్రమం చేపట్టారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి, స్థానిక నాయకులు సాలాపు మారయ్య, కంపర కోటేశ్వరరావు, నీలాపు శ్రీనివాసరావు, నీలాపు శ్రీనివాస రెడ్డి, సాలాపు రమణ, కంపర రామకృష్ణ దేవి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గోపాలపట్నం, బాజీ జంక్షన్, నరసింహనగర్, బుచ్చిరాజుపాలెం,జయప్రకాష్‌నగర్, ఎన్ఏడీ, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ప్రగతి పథం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోంది. కోట్ల రూపాయల నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తోంది. ముఖ్యంగా రోడ్లు, కాలువలు, కొండవాలులో మెట్ల మార్గాలను నిర్మించి ఎన్నో ఏళ్ల నాటి సమస్యలను పరిష్కరిస్తోంది.

- 59వ వార్డులో అభివృద్ధి జోరు
- హిమాచల్ నగర్ రహదారులకు మోక్షం
- గణపతినగర్ కొండవాలుకు మహర్దశ
- రూ.2 కోట్లతో బీటీ, సీసీ రోడ్లు, వీధి కాలువల నిర్మాణం
- సమస్యల పరిష్కారంపై స్థానికుల హర్షం



నాడు : హిమాచల్‌నగర్‌లో అధ్వానంగా రహదారి



నేడు : హిమాచల్‌నగర్‌లో నిర్మించిన బీటీ రోడ్డు



నాడు : గణపతినగర్ కొండవాలు ప్రాంతంలో కాలిబాట దుస్థితి



నేడు : గణపతినగర్ కొండవాలులో నిర్మించిన సీసీ మెట్ల మార్గం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ప్రగతి బాటలో పయనిస్తోంది. ఇక్కడి హిమాచల్ నగర్‌లోని రహదారులకు మోక్షం లభించింది. నాడు ఈ ప్రాంత రోడ్లు గుంతలు, రాళ్లు తేలి అధ్వానంగా ఉండేవి. నేడు మిలమిల మెరిసేలా అందమైన.. నాణ్యమైన సీసీ, బీటీ రోడ్లు నిర్మించారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. హిమాచల్ నగర్‌లో సుమారు 2 వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరు నగరానికి, గాజువాక తదితర ప్రాంతాలకు ఇంటి ముందు గల బీటీ రోడ్డు నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేవి. నాడు టీడీపీ పాలనలో నిర్మించిన ఈ రోడ్లు నాణ్యతా లోపం వల్ల కొన్నాళ్లకే గోతులు ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఇక్కడి మార్గాల్లో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడేవారు.

'ఆదారి' కృషితో సమస్యల పరిష్కారం

హిమాచల్ నగర్‌లో రెండు నెలల కిందట నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ స్థానికులు, వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ ద్వారా రహదారుల సమస్యను తెలుసుకున్నారు. వెంటనే ఈ ప్రాంతంలో కొత్త రోడ్లు నిర్మించేలా కృషి చేశారు. జీవీఎంసీ నిధులు రూ.50 లక్షలతో బీటీ, సీసీ రోడ్లు నిర్మించారు. హిమాచల్ నగర్‌లోని పలు వీధుల్లో కాలువలు అధ్వానంగా ఉండేవి. రూ.40 లక్షల నిధులతో వీటిని ఆధునికీకరించారు.

కొండవాలులో అభివృద్ధి పరుగులు

వార్డులోని గణపతినగర్ కొండవాలు ప్రాంతంలో కాలిబాట ఘోరంగా ఉండేది. కాలువల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. రూ.18.40 లక్షల నిధులతో కొత్తగా మెట్ల మార్గం నిర్మించారు. రూ.20 లక్షలతో సీసీ కాలువలను ఆధునికీకరించారు. రోడ్లు, కాలువల సమస్యలను పరిష్కరించడంతో హిమాచల్ నగర్, గణపతినగర్ ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు.. నిధులు

- హిమాచల్ నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి చేసిన ఖర్చు : రూ.30 లక్షలు
- హిమాచల్ నగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణ ఖర్చు : రూ.20 లక్షలు
- హిమాచల్ నగర్‌లోని పలు వీధుల్లో సీసీ కాలువల ఆధునికీకరణ ఖర్చు : రూ.40 లక్షలు
- గణపతినగర్ కొండవాలు ప్రాంతంలో మెట్ల మార్గం నిర్మాణానికి చేసిన ఖర్చు : రూ.18.40 లక్షలు
- గణపతినగర్ కొండవాలులో సీసీ కాలువల ఆధునికీకరణ ఖర్చు : రూ.20 లక్షలు

ఆదర్శంగా ప్రతి వార్డు



నియోజకవర్గంలోని ప్రతి వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. హిమాచల్ నగర్ ఒక్క ప్రాంతంలోనే సుమారు రూ.1.50 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించాం. ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తాం. – ఆదారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

ప్రజలు అభివృద్ధిని గుర్తించాలి



ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను ఆదారి ఆనంద్‌కుమార్ చొరవతో ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నాం. ప్రజలు ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని గుర్తించాలి. హిమాచల్ నగర్‌లో త్వరలో స్థానిక మహిళల కోసం సామాజిక భవనం నిర్మించేలా ఆలోచన చేస్తున్నాం.

– పుర్రె పూర్ణశ్రీ యాదవ్, కార్పొరేటర్, 59వ వార్డు

అద్దంలా బీటీ రోడ్లు



మా ప్రాంతంలో ఇటీవల నిర్మించిన బీటీ రోడ్లు సుందరంగా ఉన్నాయి. గతంలో ఆ రహదారిపై వెళ్లాలంటే గోతుల వల్ల ఒకటే ఇబ్బంది. నేడు ఆ పరిస్థితి లేదు. సాఫీగా రాకపోకలు సాగిస్తున్నాం. జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

– దున్న ప్రతాప్, హిమాచల్ నగర్

అభివృద్ధి చేసి చూపించారు



ఎన్నడూ లేని విధంగా మా ప్రాంతంలో బీటీ, సీసీ రోడ్లు, వీధి కాలువలు నిర్మించి సుందరంగా తీర్చిదిద్దారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ ప్రాంతానికి వచ్చిన ఆదారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ పూర్ణశ్రీకి సమస్యలు వివరించాం. వెంటనే అభివృద్ధి పనులు నిర్వహించారు.

– ఖాన్, హిమాచల్ నగర్

'పశ్చిమ'లో సంక్రాంతి సంబరాలు



పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్, జియ్యాని శ్రీధర్

- పోస్టర్ ఆవిష్కరించిన ఆనంద్‌కుమార్, ఎస్‌ఏ రహమాన్, జియ్యాని
- 8 నుంచి 12 వరకు పోటీలు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో సంక్రాంతి సందడి ముందే మొదలైంది. మహిళల్లో ఉత్సాహం నెలకొంది. వారిలో ముఖాల్లో సంక్రాంతి వెలుగులు సంతరించుకున్నాయి. సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గంలో ముగ్గుల పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మహిళలు, వార్డు నాయకులతో సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. ఈ పోటీల నిర్వహణ.. విధివిధానాల వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్ఏ రహమాన్ మాట్లాడుతూ సంక్రాంతి అంటే మహిళల మునివేళ్ల నుంచి రూపు దిద్దుకునే రంగవల్లులే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఆదారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను నియోజకవర్గ ప్రజలంతా ఒక కుటుంబంలా చేసుకోవాలన్నారు. ఈ పోటీలు జనవరి 8 నుంచి 12 వరకు జరుగుతాయని తెలిపారు.

మూడు విభాగాల్లో పోటీలు

మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయని ఆనంద్‌కుమార్ వెల్లడించారు. 16–25 ఏళ్ల లోపు వారు మొదటి విభాగంలోకి వస్తారు. రెండో విభాగంలో 26 నుంచి 40 ఏళ్ల వయో పరిమితి వారు. మూడో విభాగంలో 41 నుంచి 60 ఏళ్ల వారు ఉంటారని వివరించారు. వార్డు స్థాయిలో జనవరి 8 నుంచి 11 వరకు పోటీలు నిర్వహిస్తారు. ప్రతీ వార్డులో గెలుపొందిన వారికి బహుమతులు ఉంటాయన్నారు.11న నియోజకవర్గ స్థాయి పోటీలు గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రౌండ్‌లో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, కార్పొరేటర్ ముర్రు వాణి, నాయకులు చుక్క ప్రసాదరెడ్డి, నమ్మి వెంకట కృష్ణమూర్తి యాదవ్, ఆదారి శ్రీనివాసరావు, సురేష్, ఎర్రిబాబు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలయ్యేలా..

సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుకి చేరేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. నవరత్నాల సంక్షేమ ఫలాలు అందరికీ అందేందుకు మండలాల వారీగా పర్యవేక్షణ అవసరమని సూచించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల పర్యవేక్షణకు 11 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల పరిధిలో ఉన్న సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ పింఛను కానుక, చేయూత, ఆసరా తదితర కార్యక్రమాల నిర్వహణ, అమలుపై సచివాలయ సిబ్బందితో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ విధానాలు తెలపాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రత్యేక అధికారులు వీరే...

మండలం	ప్రత్యేకాధికారి	హోదా
పద్మనాభం	జి. సూర్యప్రకాశరావు	జిల్లా పౌర సరఫరాల అధికారి
భీమునిపట్నం	ఎస్. భాస్కరరెడ్డి	ఆర్డీవో, భీమిలి
ఆనందపురం	టి. సీతారామ్మూర్తి	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
విశాఖపట్నం రూరల్	జీవీఎస్ఎస్ రామమోహన్‌రావు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
సీతమ్మధార	చక్రవర్తి	డీపీవో, జీవీఎంసీ
మహారాణిపేట	చంద్రిక	డీపీవో, జీవీఎంసీ
గోపాలపట్నం	పి. శేషశైలజ	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
ములగాడ	టి. ప్రవీణ	జిల్లా కో-ఆపరేటివ్ అధికారి
గాజువాక	డి. లక్ష్మారెడ్డి	ఎస్టేట్ అధికారి, వీఎంఆర్డీఏ
పెదగంట్యాడ	డాక్టర్ వి.సన్యాసిరావు	అదనపు కమిషనర్, జీవీఎంసీ
పెందుర్తి	డి. హుస్సేన్ సాహెబ్	ఆర్డీవో విశాఖపట్నం

పేకాటరాయుళ్ల అరెస్ట్

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ సమీపంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న 10 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. లాడ్జిలో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.55,160 నగదు, 09 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాబ్‌మేళాలో 53 మంది ఎంపిక

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), శాంతి(టెక్నికల్) తెలిపారు. సుమారు 08 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 1,215 ఉద్యోగ ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 135 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 53 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన వారికి ఎంప్లాయిమెంట్ అధికారుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

ఉత్సాహంగా క్రికెట్ లీగ్



జింక్ మైదానంలో మ్యాచ్ ఆడుతున్న క్రికెట్ జట్లు

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగుతున్నాయి. జింక్ మైదానంలో శుక్రవారం ఉదయం ఎస్‌జీఆర్, గ్లామర్ గైస్ జట్ల మధ్య పోటీ జరిగింది. 15 పరుగుల తేడాతో ఎస్‌జీఆర్ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎస్‌జీఆర్ టీం సభ్యుడు అనిల్ నిలిచాడు. క్రికెట్ లీగ్ పోటీలను వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పర్యవేక్షించారు.

చెత్త తొలగింపునకు చర్యలు

గోపాలపట్నం: పారిశుధ్య కార్మికుల సమ్మెతో పేరుకు పోతున్న చెత్తను జీవీఎంసీ అధికారులు తొలగించే చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారుల్లో డంపర్ బిన్ల వద్ద పేరుకుపోయిన చెత్తను బాబ్‌కాట్ల సాయంతో లారీల్లోకి ఎత్తి తరలిస్తున్నారు. పర్మినెంట్ కార్మికులు అవుట సోర్సింగ్ సూపర్‌వైజర్ల సాయంతో శుక్రవారం సాయంత్రం ఈ పనులు చేపట్టారు.

ఘనంగా భవానీ అంబలం పూజ



అంబలం పూజలో పాల్గొన్న ఆదారి ఆనంద్‌కుమార్ తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీనివాస్‌నగర్‌లో శుక్రవారం సాయంత్రం భవానీ అంబలం పూజ ఘనంగా జరిగింది. దుర్గామల్లేశ్వర స్వామివారి ఆశీస్సులతో ఆల్ ఇండియా భవానీ దీక్ష చారిటబుల్ ట్రస్ట్ విశాఖ జిల్లా అధ్యక్షుడు యానాపు శ్రీను(గురుభవానీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ తదితరులు పాల్గొని పీఠం వద్ద నెలకొల్పిన 30 అడుగుల దుర్గాదేవికి కుంకుమ పూజలు చేశారు. సుమారు 2 వేల మంది భవానీ భక్తులు ఆలపించిన అమ్మవారి కీర్తనలతో ఆ ప్రాంతం మార్మోగింది. అతిథిగా పాల్గొన్న ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో భక్తిభావం ఉండాలన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు గులిగిందల కృష్ణ, తోనంగి వెంకటరమణియాదవ్, పిల్లా కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతలకు అభినందన



బంగారు పతకాలు సాధించిన రేష్మా, ప్రవల్లికను అభినందిస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధికి చెందిన వాకాడ రేష్మా యాదవ్, వాకాడ ప్రవల్లిక యాదవ్‌లు ఇటీవల విజయనగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలికల బాక్సింగ్ పోటీల్లో అండర్–19, 17 విభాగాల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు. కొత్త ఏడాది జనవరిలో న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గోనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం 59వ వార్డులోని పార్టీ కార్యాలయంలో ఇద్దరి బాలికలను రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ అభినందించారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి మంచి పేరు తీసుకురావాలి ఆయన ఆశీర్వదించారు. రేష్మా యాదవ్, ప్రవల్లిక యాదవ్‌ల ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఆనంద్‌కుమార్ ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఖర్చులకు గానూ వారికి రూ.15 వేలను ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, బాలికల తల్లిదండ్రులు సన్ని యాదవ్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి

- విజిలెన్స్–మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున




మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున. చిత్రంలో డీసీపీ క్రైం వెంకటరత్నం, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసులకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని వివిధ విభాగాల అధికారులకు కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున సూచించారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై కలెక్టర్ స్పందించారు. క్లిష్టమైన కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని, వివరాల సేకరణలో జాప్యం లేకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై మరింత శ్రద్ధ వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. సివిల్ రైట్స్‌పై సామాన్యులకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. స్టే కేసులపై ప్రత్యేక చొరవ చూపి హైకోర్టు పీపీతో సంప్రదించాలని స్థానిక పీపీకి చెప్పారు. స్పందన ద్వారా వచ్చే కేసులు, దిశ ద్వారా నమోదయ్యే కేసులకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చే రిలీఫ్, రిహేబిలిటేషన్ ఆర్థిక సాయం అందించాలని సంబంధిత అధికారులు తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, డీసీపీ క్రైం వెంకటరత్నం, పలువురు ఏసీపీలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా పోటీలకు 'కూల్ హెల్మెట్'

విశాఖ విద్య: జిల్లాలోని గంగవరం జెడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు పాలగుమ్మి రాజారావు రూపొందించిన కూల్ హెల్మెట్ ప్రాజెక్టు ప్రదర్శన ద్వారా రాష్ట్ర స్థాయిలో అధికారుల ప్రశంసలందుకున్నారు. కడపలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన రాజారావు మాస్టారు, తాను తయారు చేసిన కూల్ హెల్మెట్ ప్రాజెక్టును ప్రదర్శించారు. 26 జిల్లాల నుంచి టీచర్ కేటగిరీలో పది మంది ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనగా, వీరిలో రాజారావు రూపొందించిన ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకుంది. దీంతో త్వరలో జరుగనున్న సౌత్‌ఇండియా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికైన రాజారావుకు జిల్లా విద్యాశాఖాధికారులు, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా ఆళ్ల పైడిరాజు



ఆదారి ఆనంద్ కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకుంటున్న ఆళ్ల పైడిరాజు, సభ్యులు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు

గోపాలపట్నం: కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన విశాఖ పశ్చిమ సమన్వయ కర్త, ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ ఆదారి ఆనంద్ కుమార్‌ను శుక్రవారం పార్టీ కార్యాలయంలో శుక్రవారం కలిశారు. ఆయన చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. సభ్యులుగా బలిరెడ్డి శ్రీనివాస్, ఆళ్ల రాఘవేంద్ర రావు నియమితులయ్యారు. అనంతరం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కూడా మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.